# జేఎన్‌టీయూలో పరిశోధనలపై అధ్యయనం

కూకట్‌పల్లి: నీతి ఆయోగ్, ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్(ఎఫ్ఐటీటీ) ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ అధ్యయనంలో భాగంగా బుధవారం ఎఫ్ఐటీటీ ప్రతినిధులు జేఎన్‌టీయూను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల్లో రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దిశగా జరుగుతున్న కార్యకలాపాలను తెలుసుకునేందుకు ఇక్కడ పర్యటించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ), ఆర్ అండ్ డి, ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెంటర్(యూఐఐసీ) డైరెక్టర్లు ఎం. వి. ఎస్. ఎస్. గిరిధర్, డాక్టర్ చెన్నకేశవరెడ్డి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రజని, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ ఇన్‌ఛార్జి ఆశారాణితో కూడిన కమిటీ సభ్యులు వారితో సమావేశమయ్యారు. వర్సిటీలో పరిశోధనలు, సరికొత్త ప్రాజెక్టులు, స్టార్టప్‌ల దిశగా జరుగుతున్న కార్యకలాపాలు అడిగి తెలుసుకున్నారు.

# నేడు జేఎన్‌టీయూలో 'ఈసెట్' స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో నేరుగా బీటెక్, ఫార్మసీ సెకండియర్‌లో ప్రవేశానికి నిర్వహించే ఈసెట్‌లో.. కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం గురువారం 'స్పాట్ అడ్మిషన్ల' ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ బాలు నాయక్ తెలిపారు. ఈసెట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులంతా.. హైదరాబాద్ క్యాంపస్‌లో జరిగే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావచ్చని తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న పాలేరు, మహబూబాబాద్, వనపర్తి, సిరిసిల్ల, సుల్తాన్‌పూర్, జగిత్యాల, మంథనిలలోని ప్రభుత్వ కళాశాలల్లో మిగిలిన 180 సీట్లను స్పాట్ అడ్మిషన్లకు(అర్హులైన) వచ్చిన అభ్యర్థులతో భర్తీ చేస్తామని డైరెక్టర్ వెల్లడించారు.